సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18, కనిష్టం రూ.6.50 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.



నీటి బొట్టు.. ఒడిసిపట్టు

వర్షం రూపంలో అందే నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వ సిద్ధమైంది. ఇందుకోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద విరివిగా ఇంకుడు గుంతలు తవ్విస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.2°/ 17.9°

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు ఈశాన్యం దిశగా వీచాయి.

న్యూస్‌రీల్

నెట్టికంటుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



కేంద్రమంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలు, ఫొటో అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కేంద్ర పర్యాటక, ఓడరేవుల శాఖ మంత్రి శ్రీపాద్ ఎస్సోనాయక్ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, స్వామి ఫొటో జ్ఞాపికను అందజేశారు. రైల్వే డీపీఓ చౌహాన్, పలువురు బీజేపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

అందుబాటులో ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

అనంతపురం: న్యాయసేవ అధికార చట్టం కింద ప్రజా ప్రయోజన సేవల కేసుల్లో శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని న్యాయసేవా సదన్‌లో ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు జడ్జీలు ప్రసంగించారు. ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు దాఖలుకు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వత లోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగుతుందన్నారు. రాజీ మార్గంలో పరిష్కారానికి కృషి చేస్తూ.. రాజీ కుదరని పక్షంలో తీర్పులు వెలువరించగల అధికారం కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యుడు ఎస్.హరికృష్ణ, ప్రధాన న్యాయ సహాయ ప్రతివాద న్యాయవాది ఇటికె నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు 'పది' ఫీజు చెల్లించండి

ప్రశాంతి నిలయం: జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఫీజు గడువులోపు చెల్లించాలని డీఈఓ మీనాక్షి సూచించారు. 2024 మార్చిలో ప్రారంభమయ్యే పది రెగ్యులర్, ఒకేషనల్ పరీక్షలతో పాటు గతంలో పరీక్షల్లో ఫెయిల్ అయి మళ్లీ పరీక్ష రాయాలనుకునే వారు ఈనెల 28 నుంచి నవంబర్ 10వ తేదీలోపు ఫీజు చెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు కంటే ఎక్కువ సబ్జెక్ట్‌లున్న వారు రూ.125, 3 కంటే తక్కువ సబ్జెక్ట్‌లున్న వారు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నవంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు రూ.50, నవంబర్ 17 నుంచి 22వ తేదీ వరకు రూ.200, నవంబర్ 23 నుంచి 30వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చన్నారు. ఎస్‌ఆర్, ఇతర వివరాలను నవంబర్ 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.



బోయ వెంకటాద్రి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఆర్డీఓ భాగ్యరేఖ



నరసింహమూర్తి (డ్రైవర్) భార్య లక్ష్మీనరసమ్మకు చెక్కు అందజేస్తున్న దృశ్యం



నవాబుకోటకు చెందిన సుబ్బమ్మ, వెంకటనారాయణ కుమారుడు రాజశేఖర్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ



పవన్ భార్య కుళ్లాయమ్మకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

బాధితులకు ఆపన్న హస్తం

- రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం అందజేత
- ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందించిన ప్రజాప్రతినిధులు
- వేగంగా స్పందించిన సర్కారుకు బాధితుల కృతజ్ఞతలు

పెనుకొండ/గోరంట్ల/చిలమత్తూరు/కొత్తచెరువు: అయినవారిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారికి జగన్ సర్కార్ ఆపన్నహస్తం అందించింది. నిరుపేదలైన బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచింది. ఈ నెల 26న కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపురం వద్ద ఆగి ఉన్న లారీని టాటా సుమో వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో 13 మంది మృతి చెందగా, వారిలో 10 మంది జిల్లా వాసులు ఉన్న విషయం తెలిసిందే. ఘటన జరిగిన వెంటనే సీఎం జగన్ స్పందించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా వెంటనే పరిహారం బాధితులకు అందేలా చర్యలు చేపట్టారు. శనివారం రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారానికి సంబంధించిన చెక్కులను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్లు సురేష్, రంగనాయకులు తదితరులు బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. గోరంట్ల మండలం కళ్లగేరి గ్రామానికి చెందిన నరసింహమూర్తి (డ్రైవర్) భార్య లక్ష్మీనరసమ్మకు, బోయ వెంకటాద్రి, లక్ష్మీల పరిహారాన్ని వెంకటాద్రి తల్లిదండ్రులు నాగప్ప, లక్ష్మీనరసమ్మకు, అలాగే చిలమత్తూరు మండలం మొరంపల్లి గ్రామానికి చెందిన గణేష్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేశారు.

చెక్కు అందించిన ఎమ్మెల్యే దుద్దుకుంట..

కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన పవన్‌కుమార్ భార్య కుళ్లాయమ్మకు, నవాబుకోట చెందిన అగిశం సుబ్బమ్మ, వెంకటనారాయణ కుమారులు రాజశేఖర్, రాజేష్‌కు ప్రభుత్వం అందించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును శనివారం కొత్తచెరువులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అందజేశారు.



గణేష్ కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, ఎమ్మెల్యే శంకరనారాయణ

రామాయణం ఆదర్శం

- ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం
- సాయి ఆరామంలో అధికారిక సంబరం
- హాజరైన డీఆర్‌ఓ కొండయ్య, వాల్మీకి సంఘాల నాయకులు



వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య, వాల్మీకి సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: రాజ్యపాలన, కుటుంబ విలువల గురించి ప్రపంచానికి చాటిచెప్పిన రామాయణ మహాకావ్యం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని వక్తలు కొనియాడారు. రామాయణ ఇతిహాస సృష్టికర్త, ఆదికవి వాల్మీకి మహర్షి జయంత్యుత్సవం శనివారం స్థానిక సాయి ఆరామంలో వైభవంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాద్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నాల్గోసారి అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వాల్మీకులు భారీగా తరలి వచ్చారు. తొలుత వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా పలువురు వాల్మీకులను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మానవాళికి ఆదర్శప్రాయుడు..

డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి మానవాళికి ఆదర్శప్రాయుడన్నారు. రామాయణం వల్లే నేటి సమాజంలో సభ్యత, సంస్కారం ఇంకా బతికి ఉన్నాయన్నారు. మానవ సంబంధాలు ఎలా ఉండాలన్న విషయాన్ని రామాయణం ద్వారా వాల్మీకి తెలియజేశారన్నారు. రామాయణంలో బాలకాండను పిల్లలకు చెప్పాలని, దాని ద్వారా పిల్లలు సభ్యత, సంస్కారం నేర్చుకుంటారన్నారు. పెద్దలు కూడా సుందరకాండ లాంటి కావ్యాలు చదవాలన్నారు.

సీఎం చలువతోనే వాల్మీకులకు పదవులు..

వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాద్రి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి మాట్లాడుతూ... వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచానికే ఆదర్శ కావ్యమన్నారు. రాజ్యపాలకు రామాయణం చుక్కానిలా నిలిచిందన్నారు. వకుళామాత, శబరిలాంటి వారు వాల్మీకుల ముద్దుబిడ్డలన్నారు. ఇంత ఘన చరిత్ర కలిగిన వాల్మీకులను గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా అండగా నిలిచి ఎందరో వాల్మీకులకు పదవులిచ్చి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. వాల్మీకి విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. వాల్మీకులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలన్నారు. పుట్టపర్తి పట్టణంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు, కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించేందుకు, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాద్రి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, రాజకుళ్లాయప్పా, నాయకులు సిద్ధరాపురం కేశప్ప, పాదయాత్ర వాల్మీకి శంకర్, పుట్ల గంగాద్రి, శంకర్, ఆకుల నరసింహులు, రామచంద్ర, అక్కులప్ప, రాజు పాల్గొన్నారు.

రూ.5 కోట్ల భూమి దర్జాగా కబ్జా



కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో పండ్లమొక్కలు నాటిన దృశ్యం

- కదిరిలో తెలుగుతమ్ముడి భూ దందా

కదిరి అర్బన్: అధికారంలో ఉన్నన్నాళ్లూ కనిపించిన భూములన్నీ కైవసం చేసుకున్న టీడీపీ నేతలు.. ఇప్పటికీ పద్ధతి మార్చుకోవడం లేదు. కాస్త విలువైన ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ కదిరి నియోజకవర్గ ముఖ్య నేత అనుచరుడు రూ.5 కోట్లు విలువ చేసే 3.61 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. వివరాల్లోకి వెళితే... కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ సున్నపుగుట్టతండా పరిధిలోని సర్వే నంబర్ 148–2లో 3.61 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ ప్రాంతంలో బైపాస్ రోడ్డు వెళ్లడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరం రూ.కోటిపైనే పలుకుతుండడంతో టీడీపీ నేత కన్ను ప్రభుత్వ భూమిపై పడింది. భూమిని ఆక్రమించి చకాచకా బోరు వేసి, నాలుగు పండ్ల మొక్కలు నాటేశాడు.

బోరు సీజ్.. బోర్డు ఏర్పాటు

స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దార్ సునీత, ఆర్‌ఐ మున్వర్ సిబ్బంది కలసి శనివారం సదరు భూమి వద్దకు వెళ్లారు. బోరును సీజ్ చేయడంతో పాటు అక్కడ నాటిన మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బోరుకు విద్యుత్ కనెక్షన్ ఆ శాఖాధికారులు ఎలా ఇచ్చారన్న దానిపై విచారణ చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీత మాట్లాడుతూ... సున్నపుగుట్టతండా పరిధిలోని సర్వే నంబర్ 148–2 ఉన్న 3.61 ఎకరాలు ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు. ఆక్రమించాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం 'ఇది ప్రభుత్వ భూమి.. ఇందులోకి ఎవరూ ప్రవేశించరాదు' అని బోర్డు ఏర్పాటు చేశారు.



'ఈ భూమిలో ఎవరూ ప్రవేశించవద్దు' అని బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ సునీత

రబీలో రైతుకు ఇబ్బంది కలగకూడదు

- విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచండి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



చీఫ్ సెక్రటరీ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: రబీలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వర్చువల్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో విత్తనాలు, రీ సర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, మిల్లెట్ ప్రోత్సాహకం, జగనన్న పాలవెల్లువ వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు జేసీ చేతన్‌తో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ–క్రాప్ నమోదులో ఏవైనా అభ్యంతరాలుంటే 29వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల్లో సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ–కేవైసీ వెంటనే పూర్తి చేయించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలకు తగినంత ఎరువులు సరఫరా చేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డు దారులకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాడి రైతులను ప్రోత్సహించి 'జగనన్న పాలవెల్లువ' అభివృద్ధికి రుణాలు మంజూరు చేయించాలన్నారు. ఇందుకు పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రెండు, మూడో విడతలో రీ సర్వేకు సంబంధించి రాళ్లు పాతే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. జగనన్న కాలనీల్లో డ్రైనేజీ, సోక్ పిట్, విద్యుత కనెక్షన్, తాగునీటి వసతి కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: సమగ్రశిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేసేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష కార్యాలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ నాటికి 50 ఏళ్ల వయస్సు మించని డైట్ లెక్చరర్లు, మండల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ ఉపాధ్యాయులు, పాఠశాల సహాయకులు అర్హులన్నారు. అర్హులు నవంబర్ 1వతేదీ సాయంత్రంలోపు దరఖాస్తు పూర్తి చేసి బుక్కపట్నం వద్ద గల సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు www. deosss. blogspot. com వెబ్‌సైట్ చూడాలన్నారు.

లెక్చరర్ పోస్టులకు..

అనంతపురం ఎడ్యుకేషన్: బుక్కపట్నం డైట్‌లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పని చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు నవంబరు 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ నాగరాజు తెలిపారు. బోధనలో కనీసం పదేళ్ల అనుభవం ఉండి, 58 ఏళ్లలోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు.

ఆలయాల మూసివేత



ఖాద్రీశుని ఆలయ తలుపులు మూసివేసిన దృశ్యం



లేపాక్షి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

కదిరి టౌన్/లేపాక్షి: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయ తలుపులను అర్చకులు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మూసివేశారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం 6 గంటలకు ఖాద్రీశుని ఆలయ తలుపులు తెరిచి సంప్రోక్షణ చేస్తామని, 9 గంటల నుంచి భక్తులకు యథావిధిగా స్వామివారి దర్శనం భాగ్యం ఉంటుందని అర్చకులు, ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. అలాగే లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని ఉదయం 7 గంటలకు తెరుస్తామని అర్చకులు తెలిపారు. సంప్రోక్షణ తర్వాత భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి వెల్లడించారు.

నీటి బొట్టు.. ఒడిసిపట్టు

- వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత
- ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటు
- 230 మంజూరు.. 66 పూర్తి

పుట్టపర్తి అర్బన్: భూగర్భ జలాల పెంపులో భాగంగా వర్షపు నీటి సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ప్రత్యేకంగా గుంతలు నిర్మించి నేలపై రాలిన ప్రతి నీటి చుక్కనూ ఒడిసి పట్టేలా చర్యలు తీసుకుంది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల సమీపంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసి నిధులు సైతం విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంత నిర్మాణాలు వేగవంతమయ్యాయి. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పేరుతో జగనన్న కాలనీల్లో సైతం ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

నీరే జీవనాధారం..

వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు నీటి కోసం పడేపాట్లు అంతా ఇంతా కావు. పట్టణాలతో పాటు గ్రామాల్లో సైతం నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో భూగర్భజలాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా ప్రణాళికలు రూపొందించి వాటికి అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా డ్వామా ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు మొదలయ్యాయి.




పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత, మూడు వరుసలుగా కొనసాగుతున్న ఇంకుడు గుంత నిర్మాణం

230 ఇంకుడు గుంతల మంజూరు..

జిల్లాలోని 32 మండలాల పరిధిలో 544 సచివాలయాలు, 416 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఇప్పటికే సొంత భవన నిర్మాణాలు పూర్తయిన 230 కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 66 ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి అవసరమైన పైప్ లైను ఛాంబర్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.60 వేల నుంచి రూ.1 లక్షల వరకూ ప్రభుత్వం వెచ్చిస్తోంది. నిర్మాణ పనులను ఉపాధి కూలీల ద్వారా చేయిస్తూ వారి జీవనోపాధులకు ఊతమిచ్చేలా చర్యలు తీసుకుంది. పనులను ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, ప్రాజెక్టు డైరెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

నూతన సాంకేతికతతో పనులు..

ఇంకుడు గుంతను మూడు స్టెప్‌లుగా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 3.6 మీటర్ల లోతు ఇంకుడు గుంత ఏర్పాటుకు మొదటి స్టెప్‌లో 3.60 మీటర్ల వెడల్పు, రెండో స్టెప్‌లో 2.40 మీటర్లు, మూడో స్టెప్‌లో 1.80 మీటర్ల వెడల్పుతో గుంతలు తీస్తున్నారు. ఈ గుంతలను మొత్తం ఆరు లేయర్లుగా రాళ్లు, కంకరతో నింపుతారు. మొదట 9 ఇంచుల గుండు రాళ్లు, తరువాత కాస్త చిన్న సైజు, మూడో వరుసలో మరి కొంత చిన్న రాళ్లు, అనంతరం 40 ఎంఎం కంకర... 20 ఎంఎం కంకర వేసిన అనంతరం ఇసుకతో నింపుతారు. భూభాగానికన్నా కొంత ఎత్తుగా చెత్తాచెదారం చేరకుండా మీటరు ఎత్తుతో గోడను నిర్మిస్తారు. ఈ పిట్‌లోని భవనాలపై పడే వర్షపు నీరు నేరుగా గుంతలోకి చేరేలా పైప్ లైను ఏర్పాటు చేస్తున్నారు.

ఇప్పటి వరకూ ఇంకుడు గుంతల మంజూరు ఇలా..

క్లస్టర్	మంజూరు	నిర్మాణంలో ఉన్నవి	పూర్తయినవి
ధర్మవరం	58	40	08
హిందూపురం	59	34	17
కదిరి	27	16	09
మడకశిర	41	20	21
పుట్టపర్తి	45	10	11

ఇప్పటి వరకూ 66 పూర్తి



భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలు ఇప్పటి వరకూ 66 పూర్తయ్యాయి. నిర్దేశించిన గడువులోపు మిగిలినవన్నీ పూర్తి చేస్తాం. ఇవన్నీ పూర్తయితే భవనాలపై పడిన ప్రతి నీటి బొట్టును భూమిలో ఇంకిపోయేలా చేయవచ్చు. – రామాంజనేయులు, డ్వామా పీడీ

క్లుప్తంగా

గ్రంథాలయంలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి

హిందూపురం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయం పని తీరు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలపై పాఠకులతో ఆరా తీశారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలను రీడర్స్ ఆన్ డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సాధ్యమైనంత మేర పుస్తకాలను త్వరలో తెప్పించి అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయాలని గ్రంథాలయాధికారి శ్రీధర్‌కు సూచించారు. అంతకు ముందు వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరిపేలా చర్యల తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవను కొనియాడారు. మహనీయుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీధర్, సిబ్బంది గుణప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి వృద్ధురాలి మృతి

తనకల్లు: ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం ఓరువాయికి చెందిన రమణమ్మ (64) శనివారం ఉదయం తన మనవడితో కలసి తరికొండలోని కుమార్తె ఇంటి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. తనకల్లు మండలం నల్లగుట్లపల్లి మారెమ్మ గుడి వద్దకు చేరుకోగానే వాహనంపై వెనుక కూర్చొన్న రమణమ్మ అదుపు తప్పి కింద పడింది. ఘటనలో తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో ఆమెను తనకల్లులోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హిందూపురం అర్బన్: స్థానిక ఎంజీఎం పాఠశాల మైదానం సమీపంలో రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (55) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం వేకువ జామున ఈ ఘటన చోటు చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీ నాయక్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



ఉన్నికృష్ణన్ మృతదేహానికి సైనిక లాంఛనాలు నిర్వహిస్తున్న వాయుసేన సిబ్బంది



ఉన్నికృష్ణన్.జి.కర్త (ఫైల్ ఫొటో)

పుట్టపర్తి అర్బన్/ప్రశాంతి నిలయం: క్యాన్సర్‌తో బాధపడుతూ పుట్టపర్తిలోని సత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న భారత వాయుసేన విశ్రాంత వింగ్ కమాండర్ ఉన్నికృష్ణన్.జి.కార్త (74) శుకవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను పుట్టపర్తిలోనే శనివారం ఉదయం సైనిక లాంఛనాలతో వాయుసేన అధికారులు నిర్వహించారు. వివరాలు.. కేరళకు చెందిన ఉన్నికృష్ణన్ 1972లో వాయిసేనలో చేరారు. 22 ఏళ్ల పాటు టెస్ట్ పైలెట్‌గా సేవలు అందించిన ఆయన 1994లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. క్యాన్సర్ బారిన పడిన ఆయన న్యూఢిల్లీలోనే కుటుంబసభ్యులతో కలసి ఉంటూ అక్కడే చికిత్స పొందేవారు. సత్యసాయిపై ఉన్న భక్తితో తన చివరి రోజులు పుట్టపర్తిలో గడపాలన్న ఆకాంక్షతో రెండు నెలల క్రితం పుట్టపర్తికి చేరుకుని, పాలియేటివ్ కేర్‌సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఆయన మృతి చెందారు.

ఇంటి వద్దకే కార్గో సేవలు



మాట్లాడుతున్న పీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేయడమే లక్ష్యంగా పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇంటి వద్దకే సరుకు డెలివరీ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా ప్రజారవాణాధికారి (పీటీఓ) మధుసూదన్ తెలిపారు. కార్గో డోర్ డెలివరి ప్రచార మాసోత్సవాల్లో కార్గో సేవలపై శనివారం పుట్టపర్తి డిపోలో ఉద్యోగులకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం సెప్టెంబర్ నెలలో డిపోకు అధిక లాభాలు తీసుకొచ్చిన డ్రైవర్లు, కండెక్టర్లను అభినందిస్తూ రివార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... అతి తక్కువ ధరకే సరుకు రవాణా చేసేలా కార్గో సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యాప్తంగా 84 కేంద్రాల్లో కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాక ప్రధాన కేంద్రానికి 10 కిలోమీటర్ల పరిధి వరకూ ఇంటి వద్దకే సరుకు డెలివరీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనాయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పాల ట్యాంకర్ బోల్తా



బత్తలపల్లి: మండలంలోని కట్టకిందపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున పాల ట్యాంకర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన మేరకు.... తిరుపతి నుంచి బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లి సమీపం ఉన్న శ్రీజ పాల డెయిరీకి పాలు తీసుకువస్తున్న ట్యాంకర్ శనివారం తెల్లవారుజామున కట్టకిందపల్లి సమీపంలోకి రాగానే బోల్తాపడింది. డ్రైవర్ నిద్రమత్తులో తూలడం వల్లనే ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఘటనలో స్వల్పంగా గాయపడిన డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లారు. కాగా, ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. ట్యాంకర్‌లోని పాలన్నీ నేలపాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి: ఎస్పీ



రక్త దాతకు జ్యూస్ అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: అత్యవసర సమయంలో రోగికి రక్తం ఇవ్వడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చునని, ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ రక్త దానానికి ముందుకు రావాలని ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఏఆర్ సిబ్బంది, అధికారులు, ఆటో డ్రైవర్లు, పోలీసులు, పలువురు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదాతలకు జ్యూస్, ఓఆర్ఎస్ పాకెట్లను ఎస్పీ మాధవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాన విషయంగా అపోహలు వీడాలన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం మంచిదన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు, పోలీసు సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహించారని, విజేతలకు ఈ నెల 31న జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐ టైటాస్, డీఎస్పీ వాసుదేవన్, ఏఓ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి అడుగు జాడల్లో నడుద్దాం..

వాల్మీకి మహర్షి అడుగుజాడలు అనుసరణీయమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వాల్మీకి చిత్రపటానికి ఎస్పీతో పాటు ఏఎస్పీ విష్ణు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి జీవనం ఆదర్శ ప్రాయమన్నారు. బోయవాడిగా పుట్టి స్వగుణ ధర్మాన్ని వీడి మహర్షిగా వాల్మీకి ఎదిగిన తీరును వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు టైటాస్, నారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైభవం.. మధూడి రథోత్సవం



విశేష అలంకరణలో వీరభద్ర స్వామి

అగళి: మండలంలోని మధూడి గ్రామంలో వెలసిన పురాతన వీరభద్రస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేసి, వెండి, బంగారు ఆభరణాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉత్సవ మూర్తిని రథంపై అధిష్ఠింపజేసి వేకువజాము 4 గంటలకు గోవింద నామసర్మరణతో భక్తులు లాగారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



పురవీధుల్లో కొనసాగుతున్న రథోత్సవం

ఆర్బీకేల ద్వారా రాగి కొనుగోలు

- క్వింటా రాగికి మద్దతు ధర రూ.3,845
- జిల్లా సంయుక్త కలెక్టర్ టీఎన్ చేతన్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు (చిత్రంలో) జాయింట్ కలెక్టర్ చేతన్

మడకశిర రూరల్: వ్యవసాయ బోరు బావుల కింద రైతులు పండించిన రాగి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు సంయుక్త కలెక్టర్ చేతన్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వేదికగా క్వింటా రూ.3,845 మద్దతు ధరతో రాగి పంట కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. రాగి పంట కొనుగోలుపై నియోజకవర్గంలోని వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో శనివారం సాయంత్రం మడకశిరలోని సీఏఎల్ఆర్సీ భవనంలో వారు సమీక్షించారు. రైతుల నుంచి రాగి పంట కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నాణ్యత ప్రమాణాలు, తేమశాతం తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో కూపన్లు తీయడం, నగదు ఆర్డర్ సిద్ధం చేయడం తదితర అంశాలపై సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఏఓ సుబ్బారావు మాట్లాడుతూ... రైతులు నష్ట పోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో రాగి పంట కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన రాగిని పీడీఎస్ ద్వారా ప్రజలకు ఉచితంగా సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. రాగి కొనుగోలుపై రైతులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణానాయక్, తహసీల్దార్ ముర్షావలి, వైఎస్సార్ క్రాంతి పథం పీడీ నరసయ్య, ఏడీఏ కృష్ణమీనన్, ఏఓలు, వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- రాష్ట్ర స్థాయి జూడో టోర్నీ ప్రారంభోత్సవంలో ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం రూరల్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా 67వ రాష్ట్ర స్థాయి జూడో అండర్–14, 17, 19 బాలబాలికల టోర్నీ శనివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే... జ్యోతి వెలిగించి, పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 13 జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. టోర్నీలో తొలి మూడు స్థానాలు దక్కించుకున్న వారికి తాను ప్రత్యేకంగా ప్రైజ్ మనీ ఇస్తానని ప్రకటించారు. అనంతరం క్రీడాకారులకు తన సొంత నిధులు రూ.1.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ బి. ఓబిరెడ్డి, జిల్లా సెక్రటరీలు సుగుణమ్మ, అంజన్న, ఎంఈఓ గోపాల్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు బాబయ్య, నాగానందరెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై దృష్టి సారించాలి

- డీఆర్ఓ కొండయ్య



మాట్లాడుతున్న డీఆర్వో కొండయ్య (చిత్రంలో) అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను డీఆర్వో కొండయ్య ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా నియంత్రణపై అడిషనల్ ఎస్పీ విష్ణు, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్‌తో కలసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. సరిహద్దు ప్రాంతాల్లో డ్రగ్స్ కేసులు అధికంగా నమోదవుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్కృతి వ్యాప్తి చెందకుండా ఆదిలోనే అరికట్టాలన్నారు. పరిశ్రమలలో పని చేసేందుకు వచ్చిన ఇతర రాష్ట్రాలకు చెందిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు, పారిశ్రామిక వాడల్లో క్రమం తప్పకుండా నాకా బందీ చేపట్టాలన్నారు. డ్రగ్స్ మూలాలు ఎక్కడ ఉన్నాయో కనిపెట్టి వాటిని సమూలంగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ విష్ణు మాట్లాడుతూ... డ్రగ్స్ నిర్మూలనకు చేపట్టిన చర్యలను కొనసాగిస్తామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండులు, రద్దీ ప్రాంతాల్లో మానిటరింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలపై క్లోజ్ మానిటరింగ్ చేస్తున్నామన్నారు. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సోషల్ వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్, డీహెచ్ఓ చంద్రశేఖర్, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైకులు ఢీ - ముగ్గురికి గాయాలు

ధర్మవరం రూరల్: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.... ధర్మవరం మండలం నేలకోటకు చెందిన దుర్గానాయక్, అనంతపురం నివాసి రవి, ధర్మవరంలోని కోట ప్రాంతానికి చెందిన నాగభూషణ శనివారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాల్లో వెళుతూ నేలకోట శివారుకు చేరుకోగానే పరస్పరం ఢీకొన్నారు. ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. విషయాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.